ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పలు కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లమో ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

ఎంపీఈడీ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కేంద్రం 2025-26 విద్యా సంవత్సరానికి బీఏఎస్ఎల్పీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), ఎంఎస్సీ (ఆడియాలజీ) కోర్సులతో పాటు డిప్లొమా స్థాయి కోర్సులను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు www.ayjnishd.nic.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

భారత్‌కు మద్దతు ఇవ్వాలి

● ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచ దేశాలు ముందుకురావాలి

భారత దళాలకు మద్దతుగా అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

కవాడిగూడ, మే 8: ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచ దేశాలు భారత్‌కు మద్దతు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. పాకిస్థాన్ భూభాగంలో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భారత త్రివిధ దళాల ధైర్యానికి ఆయన వందనాలు తెలిపారు. గురువారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత సాయుధ దళాలకు సంఘీభావంగా ఆప్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మన దళాల ధైర్యం ప్రతి భారత పౌరుడి విశ్వాసమని, ఆపరేషన్ సిందూర్ విజయమని అన్నారు. పాకిస్తాన్ ఉగ్ర కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్రం తీసుకున్న చర్యలకు ఆప్ పూర్తి మద్దతు తెలుపుతుందని చెప్పారు. జాతీయ భద్రతపై ఎలాంటి రాజీ పడొద్దని, ఇది అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. ఉగ్రవాదులను నాశనం చేయడానికి అన్ని దేశాలు భారత్‌తో చేతులు కలిపి ప్రపంచంలో శాంతి యుత వాతావరణం ఏర్పాటు చేసేందుకు బలంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్యనాయుడు, సుధారాణి, అజీజ్‌బేగ్, షాబాజ్, సిద్దార్థ్ ఎస్ఎన్ రెడ్డి, రమ్యగౌడ్, విశాలి, లియాఖత్ ఖాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే స్వచ్ఛ సర్వేక్షణ్..

● రోడ్లపై చెత్తకుప్పలు ఎత్తరా.. అంటూ అధికారులను ప్రశ్నించిన స్థానికులు ● శానిటేషన్ సూపర్‌వైజర్ ఏంచేస్తున్నారంటూ ఆగ్రహం

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం అనంతరం శానిటరీ సూపర్‌వైజర్‌ను ప్రశ్నిస్తున్న పద్మశాలి కాలనీవాసులు

కవాడిగూడ, మే 8: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులను పద్మశాలి కాలనీవాసులు నిలదీశారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏలు గురువారం కాలనీవాసులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయరాదని కోరారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు సుందర్ పటాలే, కార్యదర్శి ఆంజనేయులు శానిటరీ సూపర్‌వైజర్‌ను నిలదీశారు. పేరుకే స్వచ్ఛ సర్వేక్షణా? రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించరా అని ప్రశ్నించారు. భోలక్‌పూర్, పద్మశాలికాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్త చెదారం దర్శనమిస్తోందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా కాకుండా పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లు, కాలనీల్లో చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను డిమాండ్ చేశారు. కాలనీవాసులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, మే 8: మెట్టుగూడ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సూచించారు. గురువారం మెట్టుగూడ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఏఈ సజద, అధికారులతో కార్పొరేటర్ రాసూరి సునీత సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత అధికారులకు తెలిపారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదని ఆమె స్పష్టం చేశారు.

కళాకారిణి విజయలక్ష్మికి మలేషియా ఆహ్వానం

చిక్కడపల్లి, మే 8: మలేషియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేషియాలోని రవాంగ్ నగరంలో నిర్వహించే 'ఉగాది' ఉత్సవాల్లో పాల్గొనేందుకు నగరానికి చెందిన ప్రముఖ నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ తమ పర్యటన వివరాలను తెలియజేశారు. తన బృందంలోని సభ్యులు రవి కూచిపూడి, మధుమతి కులకర్ణి, డి.కీర్తన, కె.నిఖిల, పి.సాయి నీహారిక, కె.విశిష్టతో కలిసి మలేషియాలో మే 10 నుంచి నాలుగు రోజుల పాటు నృత్యప్రదర్శన ఇవ్వనున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా కూచిపూడి శైలిలో ఒక నృత్య రూపకాన్ని, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ప్రత్యేక అంశాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,మే 8: అక్రమంగా విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకిలోని జేకే టవర్స్ ఎదురుగా ఉన్న స్టార్ లైట్ పాన్‌షాప్‌లో విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు సోదాలు నిర్వహించారు. షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలు విదేశీ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మే రకు పాన్‌షాపు నిర్వాహకుడు తాహెర్ అలీ బేగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెట్టుగూడ ఆర్యవైశ్య నాయకులకు సన్మానం

అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, మే 8: మెట్టుగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయంలో ఉదయం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా కలిసి మెట్టుగూడ వీధుల్లో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బెజుగం శ్రీధర్‌గుప్తా, చైర్మన్ గుండా రమేష్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి వీరేష్, మాజీ అధ్యక్షులు మధుబాబు, వేణుగోపాల్ తోపాటు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

తుకారంగేట్ సీఐగా, డీఐగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసును అడ్డగుట్ట డివిజన్ మాదిగ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. – అడ్డగుట్ట, మే 8

చీపురుశెట్టి శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్

చీపురుశెట్టి శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగంలో చీపురుశెట్టి శ్రీనివాస్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో 'ఇండియా త్రూ ఫారెన్ ఐస్: ఎ స్టడీ ఆఫ్ ది సెలెక్టెడ్ రైటింగ్ ఆఫ్ మార్క్ టులి, ఫ్యాట్రిక్ ఫ్రెంచ్, సామ్ మిల్లర్, ఎడ్వర్డ్ ల్యూస్, ఎలిజబెత్ బుమిలర్, మిరండా కెనడి' అంశంపై పరిశోధన పూర్తి చేసి శ్రీనివాస్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన ఆయన నగరంలో 25 ఏండ్లుగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్‌లో శిక్షణ అందజేస్తున్నారు. ప్రతి ఏటా తన శిక్షణతో ఎంతోమందికి ఎంఏ ఇంగ్లిష్ కోర్సులో ప్రవేశంతో పాటు, నెట్, సెట్ అర్హత సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో పాటు ఆయన ప్రస్తుతం సీవీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

అరుదైన కార్మికవర్గ పుత్రుడు సింగ్వీ

విద్యానగర్‌లో నిర్వహించిన సంజయ్ సింగ్వీ సంతాప సభలో మాట్లాడుతున్న ప్రవీణ్

ముషీరాబాద్, మే 8: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు, టీయూసీఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సంజయ్ సింగ్వీ స్మృతికి పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్ మార్క్స్ భవన్‌లో సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రతినిధులు సింగ్వీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హన్మేష్ మాట్లాడుతూ సింగ్వీ జీవితాంతం కార్మికవర్గ హక్కులు, సమ సమాజ స్థాపన కోసం పరితపించాడన్నారు. మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ మాట్లాడుతూ సింగ్వీ లాంటి కార్మికవర్గ పుత్రుడు అరుదని అన్నారు. వారి కుటుంబ నేపథ్యంలో కమ్యూనిస్టుగా కలిగి ఉన్నప్పటికీ ఈ దేశ వ్యవస్థను మార్చడం కోసం సిద్ధాంత అన్వేషణ చేశాడన్నారు. పీపుల్స్‌వార్ పార్టీతో ప్రారంభించి అనేక అన్వేషణలతో మాస్‌లైన్‌గా స్థిరత్వం పొందాడన్నారు. కార్యక్రమంలో కేజీ రామచందర్, కెచ్చెల రంగయ్య, వి.కృష్ణ, వి.ప్రభాకర్, కె.సూర్యం, ఎం.కృష్ణ, ఎస్ఎల్ పద్మ, సదానందం తదితరులు ప్రసంగించారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి, మే 8: క్రిమిసంహారక మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 24 ఏండ్ల గుర్తుతెలియని యువకుడు గురువారం చిక్కడపల్లి మెట్రో స్టేషకు వచ్చాడు. యువకుడు హఠాత్తుగా వాంతులు చేసుకొని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన మెట్రో స్టేషన్ సిబ్బంది వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే యువకుడిని గాంధీ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి యువకుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని వద్ద క్రిమిసంహారక బాటిల్ ఉందని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లభించలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ప్రేమ వ్యవహారం అయ్యుండొచ్చని పోలీసులు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసును ఎస్ఐ అభిలాష్ దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్,మే 8:గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మధురానగర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సాయి కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట మైత్రీవనం కూడలి వద్ద పిల్లర్ నంబర్ ఎ1050 పక్కన పుట్‌పాత్ పై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్ల స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని పరీక్షించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు.దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇతని వివరాల తెలిసిన వారు మధురానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

రెండు గంటల్లో.. 5 మొబైల్స్ స్నాచింగ్

నిందితులను అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

మొబైల్ ఫోన్ స్నాచర్ల వివరాలను వెల్లడిస్తున్న బంజారాహిల్స్ డీఐ మధుసూదన్

బంజారాహిల్స్, మే 8: జల్సాల కోసం రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తులవద్ద మొబైల్ ఫోన్లు లాక్కెళ్తున్న ఇద్దరు పాత నేరస్థులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు గంటల వ్యవధిలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 5 చోట్ల మొబైల్ ఫోన్లు తస్కరించినట్లు విచారణలో తేలింది. గురువారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకా రం.. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నసీర్‌ఖాన్ అలియాస్ నజీర్(24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇర్ఫాన్ ఖాన్ అలియాస్ అర్బాజ్ (30) స్నేహితులు. వీరిద్దరూ గంజాయి సేవించడంతో పాటు మద్యానికి అలవాటు పడి మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ప్రణాళిక ప్రకారం గత నెల 30న అర్ధరాత్రి దాటిన తర్వాత వీరిద్దరూ ఓ బైక్ చోరీ చేసి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 1లో కాపుకాశారు. రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న మణిపూర్‌కు చెందిన మాంగ్‌క్యా హావ్‌కిప్(21) అనే వ్యక్తి వద్దనుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీని పరిశీలించి నిందితులు నసీర్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్‌లను అరెస్ట్ చేసి విచారించగా వారిద్దరూ అదేరోజు రాత్రి రెండు గంటల వ్యవధిలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో 5సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారని విచారణలో గుర్తించారు. నసీర్‌ఖాన్‌పై గతంలో నగరంలోని పలు పీఎస్ పరిధిలో 16 కేసులు , ఇర్ఫాన్‌ఖాన్ మీద 6 కేసులు ఉన్నాయని తేలింది. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారివద్దనుంచి నాలుగు సెల్‌ఫోన్లు, హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పెట్రోల్ పోయించుకొని ఉడాయించిన యువకులు

బంజారాహిల్స్, మే 8: పెట్రోల్ పోయించుకొని బిల్లు చెల్లించకుండా ఉడాయించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని దేవరకొండ బస్తీలో నివాసం ఉంటున్న అనికేత్ కుమార్(23) అనే యువకుడు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ఆస్కి పక్కనున్న పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 4న వేకువజామున 4 గంటల ప్రాంతంలో అనికేత్ డ్యూటీలో ఉండగా నలుగురు యువకులు రెండు డ్యూక్ బైక్‌ల మీద వచ్చి పెట్రోల్ పోయించుకున్నారు. బిల్లు ఇవ్వాలని క్యాషియర్‌ను కోరగా బిల్లు రాస్తున్న సమయంలో బైక్‌ల మీద ఉన్న యువకులు వేగంగా పారిపోయారు. ఈ మేరకు బాధితుడు అనికేత్ కుమార్ గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 318(4), 316(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉచిత తాగునీటి సరఫరా కేంద్రం ఏర్పాటు

ఉచిత తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యాసాగర్

ముషీరాబాద్, మే 8: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ హైదరాబాద్, అపూర్వ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి సరఫరా కేంద్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ విద్యాసాగర్ గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు మాట్లాడుతూ వేసవిలో ఎండల దృష్ట్యా బాటసారులకు చల్లని తాగునీరు అందించాలనే ఆశయంలో కేంద్రాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన లయన్స్ క్లబ్ హైదరాబాద్ అపూర్వ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లింగాకారి మహేష్, లయన్స్ క్లబ్ హైదరాబాద్, అపూర్వ అధ్యక్ష్యులు సుధాకర్, నైనాదేవి, సూర్యనారాయణ, నీరజ, రాజశేఖర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

శామీర్‌పేట్, మే 8: కల్తీ, నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి కె.చంద్రకళ హెచ్చరించారు. శామీర్‌పేట్ మండలం దేవరయాంజల్‌లోని పలు విత్తన కంపెనీలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు తయారుచేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ ఏడీ ఎ.శివకుమార్, మండల వ్యవసాయాధికారి రమేశ్, ఎస్ఓటీ ఎస్సై రోహిత్ పాల్గొన్నారు.